రాజా రిత్విక్‌కు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఫ్రాన్స్ వేదికగా జరిగిన కాపెల్లె ఇంటర్నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత యువ గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ కాంస్య పతకంతో మెరిశాడు. ఈనెల 14 నుంచి 22వ తేదీ వరకు జరిగిన టోర్నీలో రిత్విక్ మూడో స్థానంలో నిలిచాడు. మొత్తం 9 రౌండ్లలో ఈ యువ జీఎం 7 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. 26 దేశాల నుంచి 533 మంది అగ్రశ్రేణి ప్లేయర్లు పోటీపడ్డ ఈ టోర్నీలో రిత్విక్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. తొమ్మిదింటిలో ఆరు గెలిచిన ఈ తెలంగాణ జీఎం రెండు డ్రా చేసుకుని ఒక దాంట్లో ఓటమి ఎదుర్కొన్నాడు. ఇదే టోర్నీలో బోయెర్ మహేల్(ఫ్రాన్స్), ఇనియాన్ పన్నీర్‌సెల్వం వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు.

ప్రపంచ అథ్లెటిక్స్ టోర్నీలో గుల్వీర్

న్యూఢిల్లీ: భారత యువ అథ్లెట్ గుల్వీర్ సింగ్ మరోమారు సత్తాచాటాడు. బోస్టన్(అమెరికా) వేదికగా జరుగుతున్న ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఏషియన్ రికార్డుతో పాటు ప్రపంచ అథ్లెటిక్స్ టోర్నీకి అర్హత సాధించాడు. శనివారం జరిగిన 5000మీటర్ల రేసును గుల్వీర్ 12 నిమిషాల 59.77 సెకన్ల వ్యవధిలో పూర్తి చేశాడు. ఈ క్రమంలో 13 నిమిషాల్లోపు రేసు ముగించిన తొలి భారత అథ్లెట్‌గా నిలువడంతో పాటు థాయ్‌లాండ్ అథ్లెట్ కీరన్ టునివెట్(13:08:41సె) పేరిట ఉన్న రికార్డును తిరుగరాశాడు. ఈ క్రమంలో టోక్యో వేదికగా సెప్టెంబర్ 13 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి పోటీపడనున్నాడు.

పాక్ కాస్కో

నేడు దాయాదితో భారత్ ప్రతీకార పోరు • జోరుమీదున్న టీమ్‌ఇండియా

గెలిస్తేనే నిలిచే స్థితిలో పాక్ • చాంపియన్స్ ట్రోఫీ

కోట్లాది మంది క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. క్రికెట్‌ను మతంలా భావించే భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధానికి సమయం ఆసన్నమైంది. ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో దుబాయ్ వేదికగా దాయాదులు సై అంటే సై అనబోతున్నారు. విజయమో, వీరస్వర్గమో అన్న రీతిలో సరిహద్దుల్లో సైనికులాగా కదంతొక్కనున్నారు. బంగ్లాదేశ్‌పై భారీ విజయంతో టీమ్‌ఇండియా మంచి జోష్‌మీదుంటే..న్యూజిలాండ్‌పై అనూహ్య ఓటమితో పాక్ చావోరేవో ఎదుర్కొంటున్నది. సరిగ్గా ఏడేండ్ల క్రితం చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో తమకు ఎదురైన ఓటమికి ప్రతీకారం కోసం భారత్ చూస్తుంటే..ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి ఆతిథ్య హోదాలో పరువు కాపాడుకోవాలని పాక్ పట్టుదలతో ఉంది. మొత్తంగా ప్రపంచ అత్యుత్తమ జట్ల మధ్య పోరులో ఎవరిది పైచేయి అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది.

15: వన్డేల్లో **14**వేల పరుగుల మైలురాయిని అందుకునేందుకు కోహ్లీ **15** పరుగుల దూరంలో ఉన్నాడు.

దుబాయ్: భారత్, పాకిస్థాన్ జట్లు క్రికెట్ కదనరంగంలో కలబడబోతున్నాయి. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా గ్రూపు-ఏలో ఆదివారం భారత్, పాక్ మధ్య కీలక పోరు జరుగనుంది. మెగా టోర్నీలో మరింత ముందంజ వేయాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితిలో ఇరు జట్లు ఈ పోరును మరింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. తమ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసి బోణీ కొట్టిన టీమ్‌ఇండియా అదే జోరులో పాక్ పని పట్టి సెమీఫైనల్ బెర్తు ఖరారు చేసుకోవాలని చూస్తున్నది. మరోవైపు సొంతగడ్డపై చాలా ఏండ్ల తర్వాత ఐసీసీ టోర్నీ ఆడుతున్న పాక్ పరువు కోసం పాకులాడుతున్నది. తమ తొలి మ్యాచ్‌లో కివీస్ చేతిలో చావుదెబ్బతిన్న పాక్‌కు భారత్ పోరు చాలా కీలకమైంది. మెగాటోర్నీలో నిలువాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితిని పాక్ ఎదుర్కొంటున్నది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు రద్దయిన వేళ ఐసీసీ టోర్నీలో భారత్, పాక్ పోరు కోట్లాది అభిమానులను అలరించబోతున్నది.

భారత్ జోరు: రోహిత్‌శర్మ నేతృత్వంలోని భారత్ వరుస విజయాలతో జోరు మీద ఉన్నది. మెగాటోర్నీకి ముందు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమ్‌ఇండియా..చాంపియన్స్ ట్రోఫీపై కన్నేసింది. చివరిసారి 2013లో ట్రోఫీ గెలిచిన టీమ్‌ఇండియాకు 2017లో పాక్ చెక్ పెట్టింది. అనాడు లండన్‌లో ఎదురైన ఓటమికి ఈనాడు దుబాయ్‌లో ప్రతీకారం తీర్చుకునేందుకు టీమ్‌ఇండియాకు సమయం ఆసన్నమైంది. శుభ్‌మన్ గిల్, రోహిత్‌శర్మ సూపర్‌ఫామ్‌మీదుండటం మనకు బాగా కలిసిరానుంది. బంగ్లాతో మ్యాచ్‌లో సహచరులు విఫలమైన చోట తాను ఉన్నానంటూ గిల్ బాధ్యతాయుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. స్టార్ బ్యాటర్ కోహ్లీ ఫామ్ ఒకింత కలవరపెడుతున్నా..పాక్‌తో పోరు అంటే విరాట్ విశ్వరూపం ప్రదర్శించడం అనవాయితీగా వస్తున్నది. బుమ్రా లేకపోవడం భారత్‌కు లోటు అయినా షమీ ఫామ్‌లోకి రావడం కలిసొచ్చేది. షమీకి తోడు హర్షిత్ రానా, అర్ష్‌దీప్‌సింగ్, హార్దిక్ పాండ్యా జతకలిస్తే భారత్‌కు తిరుగుండదు. కుల్దీప్, అక్షర్, జడేజా స్పిన్ తంత్రం పారితే పాక్‌కు కష్టాలు ఎదురైనట్లే. బంగ్లాతో బరిలోకి దిగిన జట్టునే పాక్‌తో మ్యాచ్‌లో కొనసాగించే అవకాశముంది.

పాక్ పరువు కోసం:

మెగాటోర్నీలో నిలువాలంటే కచ్చితంగా గెలువాల్సిన స్థితిని పాక్ ఎదుర్కొంటున్నది. కివీస్ చేతిలో ఓటమితో మెగాటోర్నీని మొదలుపెట్టిన పాక్‌కు భారత్ చేతిలోనూ ఓటమి ఎదురైతే దారులు దాదాపు మూసుకుపోయినట్లే. దీనికి తోడు ఫకర్ జమాన్ రూపంలో పాక్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. కివీస్‌తో మ్యాచ్‌లో గాయపడ్డ జమాన్..టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. జమాన్ స్థానంలో ఇమాముల్ హక్ జట్టులోకి వచ్చాడు. స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కివీస్‌పై చెత్త బ్యాటింగ్ బాబర్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. అఫ్రీది, నసీమ్‌షా, రవూఫ్‌తో పాక్ పేస్ దళం బలంగాఉన్నా..బ్యాటింగ్‌లో నిలకడలేమి ఆ జట్టును వేధిస్తున్నది.

జట్ల అంచనా: భారత్: రోహిత్(కెప్టెన్), గిల్, కోహ్లీ, అయ్యర్, రాహుల్, హార్దిక్, జడేజా, అక్షర్, రానా, షమీ, కుల్దీప్‌యాదవ్ **పాకిస్థాన్:** ఇమాముల్, బాబర్ ఆజమ్, షకీల్, రిజ్వాన్(కెప్టెన్), సల్మాన్ ఆగా, తాహిర్, కుష్దిల్ షా, అఫ్రీది, నసీమ్‌షా, రవూఫ్, అబ్రార్ అహ్మద్.

ఆసీస్ అద్భుతం

- ఇంగ్లండ్‌పై రికార్డు విజయం
- ఇంగ్లిస్ వీరోచిత సెంచరీ
- డకెట్ శతకం వృథా

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా అద్భుతం చేసింది. 2009 నుంచి ఈ మెగాటోర్నీలో గెలుపు ఎరుగని ఆసీస్ రికార్డు విజయంతో కదంతొక్కింది. శనివారం లాహోర్‌లో ప్రియమైన ప్రత్యర్థి ఇంగ్లండ్‌తో జరిగిన హై స్కోరింగ్ పోరులో ఆసీస్ 5 వికెట్ల తేడాతో విజయదుందుభి మోగించింది. ఐసీసీ టోర్నీల చరిత్రలో ఒక జట్టుపై ఇదే అత్యధిక పరుగుల ఛేదనగా రికార్డుల్లోకెక్కింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 352 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ మరో 15 బంతులు మిగిలుండగానే 5 వికెట్లు కోల్పోయి 356 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లిస్(86 బంతుల్లో 120 నాటౌట్, 8ఫోర్లు, 6సిక్స్‌లు) వీరోచిత సెంచరీకి తోడు అలెక్స్ క్యారీ(69), షార్ట్(63), మ్యాక్స్‌వెల్(32 నాటౌట్), లబుషేన్(47) రాణించారు. వుడ్, ఆర్చర్, కార్స్, రషీద్, లివింగ్‌స్టోన్ ఒక్కో వికెట్ తీశారు. 27 పరుగులకే హెడ్(6), కెప్టెన్ స్మిత్(5) వికెట్లు కోల్పోయిన ఆసీస్‌ను ఇంగ్లిస్ ఆదుకున్నాడు. ఇంగ్లండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వన్డేల్లో తొలి సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. సహచర బ్యాటర్లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పుతూ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఆఖర్లో మ్యాక్స్‌వెల్ మెరుపులతో ఆసీస్ చాంపియన్స్ ట్రోఫీలో అదిరిపోయే బోణీ కొట్టగా, ఇంగ్లండ్ కోలుకోలేని దెబ్బ పడింది. తొలుత డకెట్(165) సూపర్ సెంచరీతో ఇంగ్లండ్ 50 ఓవర్లలో 351/8 స్కోరు చేసింది. డకెట్ ఒంటరి ప్రదర్శనతో ఇంగ్లండ్ భారీ స్కోరు అందుకుంది. డ్వారిష్(3/66), జంపా(2/64), లబుషేన్(2/41) ఆకట్టుకున్నారు. ఇంగ్లిస్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది.

యూపీ వారియర్స్ బోణీ

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో యూపీ 33 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై అద్భుత విజయం సాధించింది. తొలుత యూపీ 20 ఓవర్లలో 177/9 స్కోరు చేసింది. సహచరులు విఫలమైన వేళ లోయార్డర్‌లో వచ్చిన చినెల్లీ హెన్రీ(62) అర్ధ సెంచరీతో జట్టుకు పోరాడే స్కోరు అందించింది. ఢిల్లీ బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంటూ హెన్రీ తన ఇన్నింగ్స్‌లో 2 ఫోర్లు, 8 భారీ సిక్స్‌లతో కదంతొక్కింది. జొనాసెన్(4/31) నాలుగు వికెట్లతో విజృంభించింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ 19.3 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌటైంది. రోడ్రిగ్స్(56) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. క్రాంతి గౌడ్(4/25), గ్రేస్ హారిస్(4/15) ఢిల్లీ పతనాన్ని శాసించారు. జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన హెన్రీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

తనయుడితో కలిసి ద్రవిడ్

బెంగళూరు: క్రికెట్‌లో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. తండ్రి, కొడుకు ఇద్దరు కలిసి ఒకే మ్యాచ్‌లో బరిలోకి దిగారు. వారు మరెవరో కాదు భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ తండ్రి, అతని తనయుడు అన్వయ్..కర్నాటక మూడో డివిజన్ టోర్నీలో కలిసి ఆడారు. విజయ్ క్రికెట్ క్లబ్ తరపున ప్రాతినిధ్యం వహించిన ద్రవిడ్ ఆరో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చి 10 పరుగులు చేయగా, అన్వయ్(58) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. వీరికి తోడు స్వప్నిల్(50 బంతుల్లో 107, 12ఫోర్లు, 4సిక్స్‌లు) సెంచరీతో విజయ్ క్రికెట్ క్లబ్ 345 స్కోరు చేసింది. అన్వయ్ నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అయినా క్రికెట్‌లో ఇది కొత్తేం కాదు.

లాహోర్‌లో జనగణమన..

చాంపియన్స్ ట్రోఫీలో ఘోర తప్పిదం

లాహోర్: పాకిస్థాన్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో రోజుకో ఘటన చోటు చేసుకుంటూనే ఉన్నది. దాదాపు 30 ఏండ్ల తర్వాత ఐసీసీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న పాక్..ఏర్పాట్ల విషయంలో నవ్వులపాలు అవుతున్నది. శనివారం గడాఫీ స్టేడియంలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మ్యాచ్ సమయంలో భారత జాతీయ గీతం జనగణమన రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. మ్యాచ్‌కు ముందు జాతీయ గీతాలాపనలో భాగంగా తొలుత ఇంగ్లండ్‌ది పూర్తి కాగా, ఆ తర్వాత మన జాతీయ గీతం జనగణమన రావడంతో అసలు ఏ జరుగుతుందో అర్థం కాక ప్లేయర్లు అవాక్కయ్యారు. దీనిపై సోషల్‌మీడియాలో భారీ స్థాయిలో ట్రోలింగ్ నడిచింది. పాక్‌కు భారత్ రాకపోయినా జనగణమన ప్లే అయ్యిందంటూ విమర్శలు కురిపించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.